క్లుప్తంగా

నేటి నుంచి క్రికెట్ టోర్నీ

అడ్డతీగల: మండల కేంద్రంలో సంక్రాంతి పండుగ పురస్కరించుకుని అల్లూరి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ శుక్రవారం నుంచి నిర్వహిస్తున్నట్టు అల్లూరి యూత్ కమిటీ సభ్యులు తెలిపారు. రంపచోడవరం నియోజకవర్గ స్థాయిలో జరిగే ఈ టోర్నమెంట్‌లో 64 జట్లు పాల్గొననున్నట్టు పేర్కొన్నారు. అనంత చక్రరావు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరిగే ఈ పోటీలే ఉదయం 9 గంటల నుంచి ప్రారంభించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

రగ్గుల పంపిణీ


గిరిజనులకు రగ్గులు అందజేస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

అరకులోయ రూరల్: మండలంలో మాదల, బస్కి పంచాయతీల పరిధిలోని దోమలజోరు, రత్తకండి, దాబుగుడ, కొంత్రయిగుడ, కంజరితోట, బిజ్జగుడ గ్రామాల్లో గిరిజనులకు శారద ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం గిరిజన సంఘం నాయకులు రామరావు, రామన్న రమేష్ తదితరులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చలి నుంచి పేద గిరిజనులు రక్షణ పొందేందుకు రగ్గులు, దుప్పట్లు అందజేసినట్టు చెప్పారు. గోపాల్, అప్పన్న, రామరావు తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సంస్థ సేవలు అభినందనీయం


గిరిజనులకు దుప్పట్లు, దోమతెరలను పంపిణీ చేస్తున్న ఎస్‌ఐ అప్పలసూరి

గూడెంకొత్తవీధి: రెడ్‌క్రాస్ సంస్థ సేవలు అభినందనీయమని గూడెంకొత్తవీధి ఎస్‌ఐ అప్పలసూరి అన్నారు. పెదవలస పంచాయతీ పెదలంక గ్రామంలో గురువారం రెడ్‌క్రాస్ సంస్థ సూపర్‌వైజర్ జయ తదితరులు గిరిజనులకు దుప్పట్లు, దోమతెరలను పంపిణీ చేశారు. సర్పంచ్ వంశీకృష్ణ, వార్డు సభ్యులు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు తప్పనిసరి


మాట్లాడుతున్న వెటర్నరీ డాక్టర్ రాజశ్రీ

దుంబ్రిగుడ: పశువులకు తప్పనిసరిగా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని పశుసంవర్ధక శాఖ వైద్యాధికారి రాజశ్రీ అన్నారు. గసభ పంచాయతీ లోగేలి, సువ్వగుడ, మొర్రిగుడ, గసభ, జంగిడివలస గ్రామాల్లో గురువారం వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి రాజశ్రీ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఉన్న పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయాలని సిబ్బందిని సూచించారు. శిబిరాల్లో 532 పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేశామన్నారు. పశు వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, వ్యాధులు రాకుండా జాగ్రతలు తీసుకోవాలని సూచించారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. పశుసంవర్ధక శాఖ సిబ్బంది త్రినాథరావు, అప్పారావు, సంజీవరావు, రాజు, మనోజ్ పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం


ప్రమాదంలో దెబ్బతిన్న వ్యాను

జి.మాడుగుల: మండలంలో బొయితిలి పంచాయతీ పులుసుమామిడి ఘాట్ రోడ్డులో జియో టవర్ సామగ్రి తరలిస్తున్న వ్యాను గురువారం అదుపు తప్పి లోయలోనికి దూసుకుపోయింది. ఈ ప్రమాదానికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మైదాన ప్రాంతాల నుంచి మద్దిగరువు పరిసర ప్రాంతాల్లో జియో టవర్ నిర్మాణ పనులు నిమిత్తం సామగ్రిని వ్యానులో తరలిస్తుండగా పులుసుమామిడి గ్రామ సమీపంలోని మలుపు వద్ద వ్యాను అదుపు తప్పి లోయలోకి దూసుకుపోయింది. ఈ సంఘటనలో వ్యాను నుజ్జునుజ్జయింది. టవర్ సామగ్రి ధ్వంసమయ్యాయి. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో ఆయనతో పాటు క్లీనర్‌కు చిన్నచిన్న గాయాలతో బయటపడ్డారు.



రైతన్న నేస్తాలు.. ఆర్‌బీకేలు


కోరాపల్లిలో రైతు భరోసా కేంద్రం

అన్నదాత చెంతకే సేవలు

గిట్టుబాటు ధరలతో పంటల కొనుగోళ్లు

ఆనందంలో గిరిజన రైతులు

జి.మాడుగుల: అన్నదాతకు కోసం జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం కీలక అడుగు ముందుకు వేసింది. రైతున్న దేశానికి వెనుముకని, రైతు సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. విత్తు నుంచి పంటల కొనుగోలు వరకు రైతులకు ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటోంది. రైతులకు భరోసా కేంద్రాల నుంచి వ్యవసాయ సేవలు అందించడం, శిక్షణ తరగతులు, విజ్ఞాన కేంద్రాలుగా ఏర్పాటుతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచారు. అంతే కాకుండా విత్తనాలు, ఎరువులు, పురుగులమందులను అందించటం, కాల్ సెంటర్ ద్వారా రైతులకు సూచనలు, సలహాలు అందిస్తున్నారు. రైతు భరోసా పథకం రైతు కుటుంబాలకు పెట్టుబడి ఖర్చులు అందించి వ్యసాయాన్ని ప్రోత్సహించి, పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తున్నారు. ఈ కేంద్రాల ద్వారా విత్తనం మొదలు పంట అమ్మకం వరకు సూచనలు, సలహాలను రైతులకు ఇస్తున్నారు. పంట రుణాలు, ఇన్స్యూరెన్స్, గిట్టుబాటు ధర కల్పించేలా ఈ రైతు భరోసా కేంద్రాలు పనిచేస్తున్నాయి. రైతుల వ్యవసాయాభివృద్ధి రైతు భరోసా కేంద్రాలు నిర్మాణ చేపట్టారు. సబ్సిడీ విత్తనాలు, ఎరువులు అందిస్తున్నారు. పంటలకు వ్యవసాయ పెట్టుబడి కింద రైతు భరోసా పథకంలో నగదును అందిస్తున్నారు.

- జి.మాడుగుల-2 ఆర్‌బీకే పరిధిలోని గ్రామాలు-6, రైతులు-352 మంది ఉన్నారు.
- పాలమామిడి ఆర్‌బీకే పరిధిలో-12 గ్రామాలు , 682 మంది రైతులున్నారు.
- వంజరి ఆర్‌బీకే పరిధిలో-11 గ్రామాలు, 588 మంది రైతులున్నారు.
- భీరం ఆర్‌బీకే పరిధిలో- 9 గ్రామాలు, 506 మంది రైతులున్నారు.
- గడుతూరు ఆర్‌బీకే పరిధిలో-12 గ్రామాలు, 638 మంది రైతులున్నారు.
- కె.కోడాపల్లి ఆర్‌బీకే పరిధిలో-11గ్రామాలు 440 మంది రైతులున్నారు.

సేవలివీ

ఆర్‌బీకేల ద్వారా రాయితీపై విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులతో పాటు వ్యవసాయ యంత్రాలను ప్రభుత్వం అందిస్తుంది.ఇన్‌పుట్ సబ్సిడీలు, కౌలు రైతు కార్డుల జారీ. వాటి ద్వారా రుణాలు మంజూరుకు సిఫార్సు, ఈ-క్రాప్, ఈకేవైసీ నమోదు తదితర సేవలందుతున్నాయి. రైతులకు రుణాలపై అవగాహన కల్పిస్తున్నారు. కాల్ సెంటర్ ద్వారా రైతులకు సూచనలు, సలహాలు అందిస్తున్నారు. ఆర్‌బీకేలో ఉన్న కియోస్క్ యంత్రాల ద్వారా రైతులకు పూర్తి సమాచారాన్ని అందిస్తున్నారు. క్లస్టర్ హైరింగ్ సెంటర్లు ద్వారా వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు పంపిణీ జరుగుతుంది. సబ్సిడీపై ట్రాక్టర్లు, ట్రిల్లర్లు అందజేస్తోంది. మండల వ్యాప్తంగా వరి విత్తనాల పంపిణీ- 400 క్వింటాళ్లు, రాజ్‌మా విత్తనాల పంపిణీ- 360 క్వింటాళ్లు, వేరుశనగ విత్తనాల పంపిణీ-55 క్వింటాళ్లు, రాగులు విత్తనాల పంపిణీ-20క్వింటాళ్లు పంపిణీ చేసింది.


ఆర్బీకేలోని కియోస్క్ యంత్రం వినియోగంపై రైతుకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది


గెమ్మెలిలో రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి (ఫైల్)

మండలం: జి.మాడుగుల		
పంచాయతీలు	:	17
గ్రామాలు		217
మొత్తం ఆర్‌బీకేలు	:	15
అందుబాటులో ఉన్నవి	:	6
రైతుల సంఖ్య	:	11,245
మండలంలో రైతులకు అందించిన రైతు భరోసా	:	రూ.45.79 కోట్లు
ఒక్కో ఆర్‌బికే నిర్మాణ అంచనా వ్యయం	:	రూ.21.80లక్షలు
ఆర్బీకేల నిర్మాణానికి ప్రభుత్వ సాయం	:	రూ.3.27కోట్లు


కె.కోడాపల్లిలో కస్టమ్ హైరింగ్‌పై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

అన్ని రకాల సేవలు



ఆర్‌బీకేల ద్వారా మండలంలో గల రైతులకు రకాల వ్యవసాయ సేవలు అందిస్తున్నాం. ప్రభుత్వం కిలో రాగులు రూ.38.46 గిట్టుబాటు ధర కల్పించి పాలమామిడి, వంజరి రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తున్నాం. పౌర సరఫరాల శాఖ ద్వారా పంటను మద్దతు ధర చెల్లిస్తారు. పంట సేకరణ గిట్టుబాటు ధరను రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నాం. వ్యవసాయ సిబ్బంది ద్వారా రైతులకు పంటల సాగుపై సూచనలు, సలహాలను అందిస్తున్నాం. ఆర్బీకేల ద్వారా అన్ని రకాల సేవలందిస్తున్నాం.

– పాత్రుడు, ఏవో, జి.మాడుగుల

సంతోషంగా ఉంది



నాకు ఆర్వోఎఫ్ఆర్ 2ఎకరాలు భూమి ఉంది . కొంత భూమిలో కాఫీ పంట వేశాను. ప్రభుత్వం సబ్సిడీపై రాగుల విత్తనాలు అందించడంతో పండించాను. పంటను ఆర్‌బీకేలో విక్రయించాను. రాగులకు గిట్టుబాటు ధర ప్రభుత్వం కల్పించి కొనుగోలు చేసింది. చాలా సంతోషంగా ఉంది. ప్రభుత్వం సబ్సిడీ విత్తనాలు అందించింది. వ్యవసాయ ఖర్చులకు రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయం అందించి ప్రభుత్వం రైతులకు అండగా ఉంది. సీఎం జగన్‌కి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

– చిరంజీవినాయుడు, రైతు, ఎస్.కొత్తూరు గ్రామం

జగనన్నకు కృతజ్ఞతలు



నాకున్న మూడు ఎకరాల పంట భూమిలో రెండు ఎకరాల్లో వరి పంట, అర ఎకరా భూమిలో రాగులు, మరోక అర ఎకరాలో కందులు పంటలు సాగు చేశాను. రైతు భరోసా సొమ్మును వ్యవసాయ పెట్టుబడి పెట్టాను. పండించిన పంటలను ఆర్‌బీకేల్లో విక్రయించాను. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేసింది. ఆర్‌బీకేల ద్వారా రైతులకు అన్ని రకాల సేవలు అందుతున్నాయి. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు

– బోనంగి చిన మత్స్యకొండబాబు, రైతు, గడుతూరు గ్రామం

ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్రా


చింతపల్లిలో పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీడీవో ఆశాజ్యోతి


వై.రామవరంలో పోటీలను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు


ఎటపాకలో విజేతగా నిలిచిన గన్నవరం జట్టు

చింతపల్లిరూరల్: ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు మండల కేంద్రంలో ఎంపీడీవో ఆశాజ్యోతి ఆధ్వర్యంలో గురువారం ప్రారంభమయ్యాయి. పోటీల్లో కొమ్మంగి, అన్నవరం, కుడుమసారి, బలపం, అంజలి శనివారం, కిటుముల, కొత్తపాలెం, తాజంగి, తమ్మింగుల, బెన్నవరం పంచాయతీలక చెందిన టీమ్‌లు పాల్గొన్నాయి. మండల పార్టీ అధ్యక్షుడు రవి, కార్యదర్శులు పూర్ణచంద్రరావు, గోవింద్ పాల్గొన్నారు.

వై.రామవరం: మండలంలోని యార్లగడ్డ, వై.రామవరం గ్రామ సచివాలయాల వద్ద ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. ఈవోపీఆర్డీ డి.శివకుమార్ పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శులు మధుసూధనరాజు, భార్గవచరణ్‌ల అధ్యక్షతన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కర్ర వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ వలాల విశ్వమ్మ, ఎంపీటీసీ వీరమళ్ల సుబ్బలక్ష్మి, సర్పంచ్ పల్లాల బాలురెడ్డి ఆటల పోటీలను ప్రారంభించారు. సచివాలయాల కన్వీనర్ కనకరాజు, నాయకుడు త్రిమూర్తులు, నారాయణరావు, యోగేంద్రం, తదితరులు పాల్గొన్నారు.

ఎటపాక: ఆడుదాం ఆంధ్రా క్రీడలు గ్రామాల్లో యువతకు ఉల్లాసాన్ని నింపుతున్నాయి. ఎటపాక మండలంలో ఇప్పటి వరకు జరిగిన క్రీడా పోటీల్లో యువత ప్రతిభ కనపర్చి నియోజక వర్గ స్థాయి క్రీడలకు ఎంపిక కావడంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. కబడ్డీ పోటీలో గన్నవరం జట్టు, బ్యాడ్మింటన్‌లో ఎటపాక, వాలీబాల్ పోటీలో గొమ్ముకొత్తగూడెం జట్టు నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికయ్యాయి.

ఆర్‌బీకేల్లో రాగుల కొనుగోళ్లు


వ్యవసాయ శాఖ ఏడీఏ జాహ్నవి

చింతపల్లిరూరల్: రైతు భరోసా కేంద్రాల ద్వారా రాగులు కొనుగోలు చేస్తున్నట్టు ఏడీఏ కంటా జాహ్నవి చెప్పారు. ఆమె గురువారం విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన రైతులు పండించిన చోడి (రాగులు) పంటను ఆర్బీకేలా ద్వారా విక్రయించుకుని గరిష్ఠ ధర పోందాలని సూచించారు. చింతపల్లి, జీకే వీధి మండలాల్లో తాజంగి, కొత్తపాలెం, లోతుగెడ్డ, దేవరాపల్లి, లక్కవరపుపేట గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేశామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండల వ్యాప్తంగా ఇప్పటికే 60 శాతం నూర్పులు జరిగినట్టు తెలిపారు. రాగి క్వింటాకు రూ.3843 ధర ప్రభుత్వం అందిస్తుందన్నారు. పంటను దళారులకు అమ్మి మోసపోవద్దని సూచించారు. పంటల కొనుగోళ్లపై ఎటువంటి సందేహాలున్నా వ్యవసాయాధికారి, సచివాలయ వ్యవస్థాయ సహాయ సిబ్బందిని సంప్రదించాల్సిందిగా ఆమె కోరారు.

అభివృద్ధి పనుల ప్రణాళికపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో వెంకటేష్, చిత్రంలో ఎంపీపీ ఉషారాణి

అరకులోయ రూరల్: గ్రామాల్లో అభివృద్ధి పనుల ప్రణాళికపై అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో వెంకటేష్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధికి ఆర్థిక సంఘం నిధులతో ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అధికారులు, ప్రజాప్రతినిధులతో ప్రణాళిక తయారీకి ప్రత్యేకంగా చర్యలు చేపడుతున్నమన్నారు. ఇందులో భాగంగా తాగునీరు, సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలు తదితర పనులు నిర్వహించేందుకు ప్రణాళిక ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఎంపీపీ ఉషారాణి మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంగా పనిచేస్తేనే ప్రజా సమస్యలు సత్వరంగా పరిష్కరించుకోవచ్చన్నారు. వైస్ ఎంపీపీ రామన్న, సర్పంచ్‌లు బొజ్జ, బుటికి, ఎంపిటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రకృతి సాగులో మోడల్ మండలంగా అభివృద్ధి


మాట్లాడుతున్న ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు రీజనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ కృష్ణారావు

గంగవరం : ప్రకృతి వ్యవసాయం అమలులో గంగవరం మండలాన్ని మోడల్ మండలంగా అభివృద్ధి చేసినట్టు ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు రీజనల్ కో-ఆర్డినేటర్ కృష్ణారావు చెప్పారు. మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఏపీఎం జేమ్స్ అధ్యక్షతన మండల మహిళా సమాఖ్యా సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ సాగు ద్వారా జరిగే కార్యక్రమాలను వివరించారు. ఈ మేరకు మోడల్ మండలంగా గంగవరాన్ని ఎంపిక చేసినట్టు తెలిపారు. వెలుగు, సెర్ప్‌లో జరుగుతున్న కార్యక్రమాలను తెలియజేశారు. డీఎల్‌ఎం శ్రీనివాసు, ప్రకృతి వ్యవసాయ సహాయకులు గంగరాజు, ఎంటీ పద్మజ, వెలుగు సీసీలు, పాల్గొన్నారు.

రేపు రక్తదాన శిబిరం

కూనవరం: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్టు చేయూత బ్లడ్ ఆర్గనైజేషన్ నిర్వాహకుడు మచ్చా వినయప్రసాద్ గురువారం తెలిపారు. అత్యవసర సమయంలో ఎంతో మంది ప్రజల ప్రాణాలను కాపాడే రక్తదాతలు ఈ శిబిరంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. రక్తదానంలో పాల్గొన్న వారికి రంపచోడవరం ఏరియా ఆస్పత్రి సూరింటెండెంట్ నుంచి ధ్రువపత్రాలు అందజేయనున్నట్టు తెలిపారు. రక్తదాన శిబిరంలో చింతూరు ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎం.వి. కోటిరెడ్డి, స్టాఫ్‌నర్స్ కె.సత్యవతి, బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ వి.సత్తిబాబు, హెల్పర్ కిరణ్‌కుమార్, పండుదొర పాల్గొంటున్నట్టు తెలిపారు.

సినిమా థియేటర్ పునఃప్రారంభం

రాజవొమ్మంగి: మండల కేంద్రంలో శ్రీ వేంకటేశ్వర థియేటర్ ఏడాది తరువాత శుక్రవారం పునఃప్రారంభిస్తున్నారు. ఈ థియేటర్‌లో శుక్రవారం నుంచి మహేష్‌బాబు నటించిన గుంటూరు కారం సినిమా రోజుకు నాలుగు ఆటలు ప్రదర్శిస్తున్నట్టు థియేటర్ యాజమాన్యం ప్రకటించింది. ఈ సినిమా బెనిఫిట్ షో ఉదయం 8 గంటలకు ప్రదర్శించనున్నట్టు పేర్కొన్నారు. రాజవొమ్మంగిలో సినిమా థియేటర్ పునఃప్రదర్శనతో స్థానికుల్లో సందడి నెలకొంది. పండుగ జోష్ మొదలైంది.

మేలుజాతి దూడల ప్రదర్శన


మేలు జాతి దూడలను పరిశీలిస్తున్న అధికారులు

చీడికాడ: మేలుజాతి దూడల పోషణ పట్ల రైతులకు అవగాహన అవసరమని ఎంపీపీ కురచా జయమ్మ అన్నారు. ఖండివరంలో మండల స్థాయి లేగదూడల ప్రదర్శనను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ జాతులకు చెందిన 40 లేగదూడలను జిల్లా పశుగణాభివృద్ధి సంఘం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టరు బి.రామమోహన్‌రావుతో కలిసి పరిశీలించారు. మెరుగైన దూడల పోషణను చేసిన రైతులు సింగంపల్లి కొండబాబు, జూరెడ్డి గోవిందరావు, డోకల నాయుడు, గడెం చిలుకులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గెంజి స్వాతి బాలాజీ, మాడుగుల పశుసంర్థక శాఖ ఏడీ డాక్టరు చిట్టినాయుడు, పశువైద్యులు మణిలక్ష్మణ్, అరుణ్‌కిరణ్, గణేష్ పాల్గొన్నారు.

ముగిసిన మార్గశిర మాసోత్సవాలు


అమ్మవారికి పూజలు చేస్తున్న మహిళలు

ఎస్.రాయవరం : శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి మాసోత్సవాలు గురువారంతో ముగిసాయి. కర్రివానిపాలెం గ్రామంలో అమ్మవారి ఆలయం వద్ద అయిదు వారాలుగా గురువారం రోజున ప్రత్యేక పూజలు నిర్వహించి వారాంతపు అన్న సమారాధన నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

ధర్మవరం కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో...


ప్రత్యేకాలంకరణలో కనకమహాలక్ష్మి అమ్మవారు

యలమంచిలి రూరల్ : ధర్మవరం కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఈ ఏడాది మార్గశిర మాసోత్సవాలు గురువారంతో ఘనంగా ముగిశాయి. మార్గశిరం అమావాస్య సందర్భంగా గురువారం అనేక మంది భక్తులు అమ్మవారి ఆలయానికి వెళ్లారు. అమ్మవారి మూలవిరాట్‌కు మహిళా భక్తులు అభిషేకాలు చేసి, పసుపు, కుంకుమలు సమర్పించి హారతులిచ్చారు. ఆలయ అర్చకులు కోటి పంతులు భక్తుల గోత్రనామాలతో పూజా కార్యక్రమాలు చేశారు. నెల రోజుల పాటు ధర్మవరం కనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయం భక్తుల పూజలతో కిక్కిరిసిపోయింది. ఈ నెల 19న అమ్మవారి తీర్థ మహోత్సవం వైభవంగా నిర్వహించడానికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేస్తోంది.

గౌరీపరమేశ్వరుల ఉత్సవ పోస్టర్ ఆవిష్కరణ


అనకాపల్లి : స్థానిక వేల్పులవీధి గౌరీపరమేశ్వర మహోత్సవ జాతరను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు వాకాడ బాబు, కార్యదర్శి మద్దాల నూకరాజు చెప్పారు. ఆలయ ఆవరణలో గురువారం ఉత్సవ కరపత్ర ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన 83వ వార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి, జాజుల రమేష్ దంపతులు కరపత్రాన్ని ఆవిష్కరించారు. అంతకు ముందు కార్పొరేటర్ దంపతులను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు శీరంశెట్టి నరసింగరావు, కోశాధికారి గణేష్, శంకర్ల పద్మ, వీధిపెద్దలు మద్దాల కూర్మారావు, మద్దాల రమణబాబు, నల్లల రాజు, ముమ్మిన సూరిబాబు, బొండా శంకరరావు, ఉగ్గిన అప్పారావు, కొంకి శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

జోరుగా రబీ వరి నాట్లు



ఎస్.రాయవరం : మండలంలో జోరుగా రబీ వరినాట్లు వేస్తున్నారు. గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సకాలంలో వర్షాలు కురవక సర్వసిద్ధి, సైతారుపేట, పేటసూదిపురం, ఉప్పరాపల్లి గ్రామాల్లో నాట్లు వేయలేదు. ఇటీవల మైచాంగ్ తుపాను కారణంగా మండలంలో భారీ వర్షాలు కురిసి, వరహానది ఉప్పొంగిన సంగతి తెలిసిందే. నదిలో నీరు, కాలువల ప్రవాహంతో రబీనాటుక్కు సిద్ధమయ్యారు. నారుపోసి ప్రస్తుతం నాట్లుకు సిద్ధమయ్యారు. ఈ మూడు గ్రామాల్లో సుమారు 3 వందల ఎకరాల వరకు నాట్లు వేస్తామని చెబుతున్నారు. మండలంలో ఖరీఫ్ నాట్లు తప్ప, రబీ సాగు చేయని రైతులకు ఇది సాహసమే అని చెబుతున్నారు. రబీలో తేలికపాటి రకం (120 రోజులు)సాగు చేస్తున్నప్పటికీ ఖర్చులు అధికంగా అవుతున్నాయని రైతులు చెబుతున్నారు.

రోలుగుంటకు చేరిన భక్తుల పాదయాత్ర


రోలుగుంటలో పాదయాత్రగా వెళ్తున్న చింతపల్లి భక్త బృందం

రోలుగుంట: అయోధ్య రామ మందిరంలో ఈ నెల 22న నూతన విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం విజయవంతం చేయాలని అల్లూరి జిల్లా చింతపల్లికి చెందిన రామభక్త బృందం విశాఖ జిల్లా సింహాచలం వరకు చేపట్టిన పాదయాత్ర గురువారం రోలుగుంట చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లోక కల్యాణార్థం సనాతన ధర్మం పరిరక్షణార్థం ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. భక్తులు పెద్ద ఎత్తున అయోధ్యకు తరలిరావాలని కోరారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి


అవగాహన కల్పిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి సాయికుమారి

యలమంచిలి రూరల్ : ప్రతి ఒక్కరూ చట్టాలు, రాజ్యాంగంపై అవగాహన పెంచుకోవాలని యలమంచిలి సీనియర్ సివిల్ జడ్జి ఎ. సాయికుమారి అన్నారు. గురువారం యలమంచిలి రైల్వేస్టేషన్‌లో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బాలకార్మికుల పునరావాస వారోత్సవాల్లో భాగంగా జరిగిన న్యాయ విజ్ఞాన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రతి ఒక్కరూ బాలకార్మిక చట్టాలను గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పేదవారు, వయోవృద్ధులు, మహిళలకు న్యాయ సహాయం అందించడమే లీగల్ సెల్ అథారిటీ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు పౌరులంతా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐ షేక్ గఫూర్, పట్టణ ఎస్‌ఐ కె. పాపినాయుడు, ఏజీపీ డి.వెంకట్రావు, యలమంచిలి రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ ఆకుల సురేష్ కుమార్, డ్యూటీ స్టేషన్ మాస్టర్ పి. అశోక్, లోక్ అదాలత్ సభ్యుడు రమణ, న్యాయవాదులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
9676392974, 9390991099

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పాడేరు డివిజన్:
9010973030, 9010234557
Office mail : sakshiadvtvsp@gmail.com